క్లుప్తంగా

ఘనంగా జగన్నాథ స్వామి రథ ప్రతిష్ట



జగన్నాథ స్వామి రథం ప్రతిష్టలో పాల్గొన్న భక్తులు

బూర్జ: మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించనున్న రథయాత్రకు ముందు రోజు గురువారం జగన్నాథ స్వామి రథం ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం జగన్నాథ స్వామితో లక్ష్మీదేవికి వివాహం జరిపించారు. ప్రధాన అర్చకులు సత్యానారాయణ పూజారి, గోపేశ్వర సాహు ఆధ్వర్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ కాటాలకు సీళ్లు



చల్లవానిపేటలో ఎలక్ట్రానిక్ కాటాలకు సీళ్లు వేస్తున్న అధికారులు

జలుమూరు: మండలంలోని చల్లవానిపేట వ్యాపార కూడలిలో గల పలు దుకాణాలను పలాస డివిజన్ తూనికలు, కొలతలశాఖ ఇన్స్పెక్టర్ ఎ.బలరామకృష్ణ గురువారం తనిఖీ చేశారు. 194 ఎలక్ట్రానిక్ కాటాలకు సీళ్లు వేశారు. సీళ్లులేని కాటాలను గుర్తించి ఐదుగురు వ్యాపారాలకు అపరాధ రుసుం విధించారు. నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సిబ్బంది నరసింహమూర్తి, చింతాడ గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు సర్వీసులు పునరుద్ధరించాలి



టెక్కలి డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నారాయణమూర్తి

పాతపట్నం: పాతపట్నం నుంచి టెక్కలికి వెళ్లే పలు ఆర్టీసీ బస్సులు వివిధ కారణల వల్ల నిలిపివేశారని, వాటిని పునరుద్ధరించాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు బి.నారాయణమూర్తి అన్నారు. ఈ మేరకు టెక్కలి ఆర్టీసీ డిపో మేనేజర్ ఎన్.శ్రీనివాసరావుకు గురువారం వినతిపత్రం అందజేశామన్నారు. పాతపట్నం నుంచి టెక్కలికి వెళ్లే ప్రయాణికులు ఎక్కువగా ఉంటారన్నారు. పాతపట్నం నుంచి పలాస, పార్వతీపురం, పాలకొండ, తదితర ప్రాంతాలకు ఆర్టీసీ బస్సు సర్వీసులు ఉండేవని, వాటిని పునః ప్రారంభించాలన్నారు.

రూ.1.50 కోట్లతో అభివృద్ధి పనులు



రోడ్డు పనులను పరిశీలిస్తున్న సర్పంచ్, తదితరులు

నరసన్నపేట: మేజరు పంచాయతీ నరసన్నపేటలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.50 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు సర్పంచ్ బి.శంకర్ తెలిపారు. పంచాయతీ నిధులు రూ.2.5 లక్షలతో స్థానిక రైతు సేవా కేంద్రం వద్ద రహదారి నిర్మాణ పనులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీలో 45 పనులు చేపడుతున్నామన్నారు. వీలున్నంత తొందరగా ఈ పనులు పూర్తిచేయాలని వార్డు సభ్యులకు సూచించారు. ఉప సర్పంచ్ ఎస్.కృష్ణబాబు, వార్డు సభ్యులు ఆర్.శ్రీధర్(బుజ్జి), సతీష్, తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటుపై అవగాహన

నరసన్నపేట: యువతీ, యువకులు చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు రావాలని ఏపీఎస్ఎఫ్‌సీ మేనేజర్ జి.రవి కుమార్ అన్నారు. స్థానిక కల్యాణ మండపంలో ఎంఎస్ఎంఈలకు ఒక్క రోజు అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు అనేక మార్గాలు, అవకాశాలు ఉన్నాయన్నారు. యువత ముందుకు వస్తే వారికి అవసరమైన రుణాలు ఇవ్వడానికి, సూచనలు, సలహాలు ఇవ్వడానికి ఆసక్తిగా ఉన్నట్లు తెలిపారు. పరిశ్రమలశాఖ ఏడీ పి.వి.రఘునాథ్ యువతకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో రోహిత్ కుమార్ గాడ్గే, ఎంఎస్ఎంఈ ప్రతినిధులు పాల్గొన్నారు.

పన్నుల ఎగనామం..!

- ఏళ్ల తరబడి పన్నులు చెల్లించని వైనం
- మేజరు పంచాయతీపై మొండి బకాయిల భారం
- రూ.లక్షలకు చేరిన బకాయిలు
- పంచాయతీ అభివృద్ధిపై తీవ్ర ప్రభావం
- నోటీసులకు ఖాతరు చేయని యజమానులు
- మరింత కఠినంగా వ్యవహరించాలంటున్న పాలకవర్గ సభ్యులు



నరసన్నపేట పంచాయతీ కార్యాలయం

నరసన్నపేట: మేజరు పంచాయతీ నరసన్నపేటలో ఇంటి పన్నుల మొండి బకాయిలు గుదిబండగా మారుతున్నాయి. ఏళ్ల తరబడి పన్నులు చెల్లించకుండా పలువురు ఎగనామం పెడుతుండటంతో పంచాయతీ అభివృద్ధిపై దీని ప్రభావం తీవ్రంగా పడుతోంది. మొండి బకాయిలు ఏటా పెరుగుతున్నాయి. 2023–24లో రూ.1.27 కోట్లు ఉండగా.. 2024–2025 నాటికి రూ.1.30 కోట్లకు పెరిగాయి. 2025–2026 నాటికి ఇవి మరింత పెరిగాయి. పంచాయతీలో అభివృద్ధి పనులు చేయాలన్నా, పారిశుద్ధ్య కార్మికుల సంఖ్య పెంచుకోవాలన్నా.. ఇతర కార్యక్రమాలు చేపట్టాలన్నా నిధుల కొరత వెంటాడుతోంది.

ఇంటి పన్నులే ప్రధాన ఆర్థిక వనరు..

మేజరు పంచాయతీకి ఇంటి పన్నులే ప్రధాన ఆర్థిక వనరు. పంచాయతీలో 7,193 గృహాలున్నాయి. దీంట్లోనే వివిధ వ్యాపార సంస్థలు, బ్యాంకులు, షాపింగ్ మాల్స్, షోరూమ్‌లున్నాయి. ఇంటి పన్ను వసూలు సక్రమంగా అవుతున్నా.. బ్యాంకులు, కొన్ని వ్యాపార సాముదాయాల నుంచి పన్ను వసూలు కావడంలేదు. బ్యాంకులకు, ఇతర వ్యాపార సంస్థలకు బిల్డింగ్‌లను అద్దెలకు ఇస్తూ లక్షల రూపాయలు ఆర్జిస్తున్నా.. పంచాయతీకి మాత్రం పన్నులు కట్టడం లేదు. వీటి నుంచే ఎక్కువగా మొండి బకాయిలు పెరుగుతున్నాయి. కరెంట్ డిమాండ్, ఏరియర్స్‌లో కలిపి ఏటా రూ.2.30 కోట్లు వరకు ఇంటి పన్ను వసూలు కావాల్సి ఉండగా, కరెంట్ డిమాండ్ తప్ప ఎరియర్స్ వసూలు కావడం లేదు. దీనిని గమనించిన పంచాయతీ అధికారులు నోటీసులు జారీ చేస్తున్నా.. వారు పట్టించుకోవడం లేదు. దీంట్లో కొందరు రాజకీయ నాయకులు ఉండగా.. మరికొందరు ఇతర వర్గాలవారు ఉన్నారు. మొండి బకాయిలు మరింత పెరగకుండా బకాయిదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని పాలకవర్గం అధికారులకు సూచిస్తోంది. మంగళవారం పంచాయతీ సర్వసభ్య సమావేశం జరిగింది. దీంట్లో ఇంటి పన్ను బకాయిలపై సభ్యులు ఆందోళన చెందారు. బకాయిదారులు ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకోవాలని సర్పంచ్ బి.శంకర్‌తోపాటు ఉపసర్పంచ్ ఎస్ కృష్ణబాబు, వార్డు సభ్యులు కోరారు. కార్పొరేషన్ బ్యాంకు భవన యజమాని 2013–14 ఆర్థిక సంవత్సరం నుంచి ఇంటి పన్ను చెల్లించడం లేదు. నారాయణ స్కూల్ యజమాని 2021 నుంచి పన్ను చెల్లించాలి. కరూర్ వైశ్యా బ్యాంక్ భవన యజమాని 2018 నుంచి చెల్లించాల్సి ఉంది. పలువురు ఏళ్ల తరబడి ఇంటి పన్నులు చెల్లించాల్సి ఉంది.

ఇంటి పన్ను వసూలు వివరాలు ఇలా..

ఆర్థిక సంవత్సరం	మొత్తం బకాయిలు	వసూళ్లు
2023–24	రూ.2.38 కోట్లు	రూ.64.86 లక్షలు
2024–25	రూ.2.44 కోట్లు	రూ.92.38 లక్షలు
2025–26	రూ.2.51 కోట్లు	రూ.7.65 లక్షలు (జూన్ వరకు)

మొండి బకాయిల్లో కొన్ని..

- కార్పొరేషన్ బ్యాంకు: రూ.14.02 లక్షలు
- నారాయణ స్కూల్: రూ.9.82 లక్షలు
- పొట్నూరు రామసోమేశ్వరరావు: రూ.9 లక్షలు
- బోయిన రాకేష్ కమర్షియల్ భవనం: రూ.1.04 లక్షలు
- రావాడ లక్ష్మీనారాయణ కమర్షియల్ భవనం: రూ.1.72 లక్షలు

పంచాయతీ అభివృద్ధిపై ప్రభావం



పంచాయతీలో మొండి బకాయిలు ఎక్కువ అవుతున్నాయి. కోట్లల్లో ఉండటంతో పంచాయతీ అభివృద్ధిపై ప్రభావం పడుతుంది. ఏళ్ల తరబడి కొందరు ఇంటి పన్ను చెల్లించడం లేదు. బకాయిలు చెల్లించి పంచాయతీ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి.

– బి.శంకర్, నరసన్నపేట సర్పంచ్

నోటీసులు ఇస్తున్నాం



మొండి బకాయిలపై మరింత దృష్టి పెట్టాం. అందరికీ నోటీసులు ఇస్తున్నాం. చాలా మంది లక్షల్లో బకాయి పడి ఉన్నారు. నోటీసులకు స్పందించి బకాయిలు చెల్లించాలి. మంగళవారం పంచాయతీ సమావేశంలో దీనిపై చర్చ జరిగింది. బకాయిదారులపై మరింత కఠినంగా వ్యవహరించాలనుకుంటున్నాం.

– పి.ద్రాక్షాయిని, పంచాయతీ కార్యనిర్వహణాధికారి, నరసన్నపేట

నేడు రథయాత్ర



హిరమండలం: జగన్నాథస్వామి ఆలయం

పాతపట్నం: పాతపట్నంలో జగన్నాథుని రథయాత్రకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆయల ప్రధాన అర్చకుడు చంద్రశేఖర్ పండా గురువారం తెలిపారు. శుక్రవారం సాయంత్రం రథ యాత్ర మార్కెట్, పంచాయతీ కార్యాలయం బస్టాండ్, మెయిన్ వీధి మీదుగా బ్రాహ్మణవీధిలో ఉన్న గుండిచా మందిరానికి వెళ్తుందన్నారు. దశవతారాలు ప్రదర్శించి గుండిచా మందిరంలోనే స్వామివారు పూజలు అందుకుంటారన్నారు. తిరుగు రథ యాత్రతో జగన్నాథుడు ప్రధాన ఆలయానికి చేరుకుంటారన్నారు.

హిరమండలంలో..

హిరమండలం: రథయాత్ర శుక్రవారం సాయంత్రం 4 గంటలకు స్థానిక జగన్నాధస్వామి ఆలయం నుంచి రథయాత్ర ప్రారంభమవుతుందని అర్చకులు శ్రీనివాసపాడి, సురేష్ పాడి తెలిపారు. ఉత్సవ మూర్తులను ఊరేగిస్తామని, రథయాత్రలో మూల విరాట్‌ను ఉంచుతామన్నారు. ఈ ఉత్సవాలు జులై 5వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. జగన్నాథుడు రోజుకొక అవతారంలో భక్తులకు దర్శనమిస్తారన్నారు.

శ్రీముఖలింగంలో..

జలుమూరు: జగన్నాథ రథయాత్ర మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీముఖలింగం భద్రమహాం కాళి అమ్మవారి గుడి నుంచి అచ్యుతాపురం రామాలయం వరకు రథయాత్ర ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. అచ్యుతాపురం గ్రామానికి చెందిన బగ్గు జగన్నాథరావు సహకారంతో నిర్మాణం చేసి రథంలో స్వామివారి తిరువీధి ఉత్సవం నిర్వహిస్తామన్నారు. శనివారం సాయంత్రం తిరుగు యాత్ర ఉంటుందని గురుస్వామి జగన్నాథరావు తెలిపారు. మర్రివలస పంచాయతీ పరిధి బైరాగిపేటలో జగన్నాథస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి జూలై 7వ వరకు రథయాత్ర ఉత్సవాలు నిర్వహిస్తామని అర్చకులు కార్తీక్‌దాస్ తెలిపారు.

నూతన తరగతి గదులకు ప్రతిపాదన



కళాశాలను సందర్శిస్తున్న డీవీఈఓ సురేష్‌కుమార్

పొందూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నూతన తరగతి గదుల మంజూరుకు ప్రతిపాదనలను చేయనున్నట్లు డీవీఈఓ వై.సురేష్ కుమార్ అన్నారు. గురువారం పొందూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. కళాశాలలో శిథిలావస్థకు చేరుకున్న తరగతి గదులను పరిశీలించారు. నూతన తరగతి గదులను మంజూరు చేసేలా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు తెలిపారు. కళాశాలలో మెరుగైన ప్రవేశాలకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని సూచించారు. ప్రిన్సిపాల్ టి.ఇందిర, అధ్యాపకులు ఉన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు



విత్తనాల షాపులో రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ సూర్యకుమారి

నరసన్నపేట: విత్తనాలు అధిక ధరలకు విక్రయాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయాధికారి సూర్యకుమారి అన్నారు. మండల కేంద్రంలోని వరి విత్తనాల విక్రయ దుకాణాను గురువారం పరిశీలించారు. కొన్ని షాపుల నుంచి వరి విత్తనాల శాంపిల్స్‌ను సేకరించారు. వీటిని ల్యాబ్‌కు పంపిస్తామని, 80 శాతం పైబడి మొలక శాతం వస్తే సరైన విత్తనాలుగా భావిస్తామని, మొలక శాతం తగ్గితే చర్యలు తీసుకుంటామని, అవసరమైతే పైఅధికారుల సూచనలతో కేసులు నమోదు చేస్తామన్నారు. విత్తన విక్రయదారులకు పలు సూచనలు చేశారు. ఇష్టానుసారంగా ధరలు పెంచి విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. నిబంధనలకు మించి రేట్లు పెంచి విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు విక్రయించాలని, బిల్లులు ఇవ్వాలన్నారు. నిల్వల వివరాలు రికార్డుల్లో కచ్చితంగా ఉండాలన్నారు.

నట్టల నివారణ మందులు పంపిణీ



పెద్దలోగిడిలో గొర్రెలకు నట్టల నివారణ మందు వేస్తున్న ఏడీ కరుణాకరరావు

పాతపట్నం: పాతపట్నం, మెళియాపుట్టి మండలాల్లోని గొర్రెలు, మేకలకు ఉచితంగా నట్టల నివారణ మందులు పంపిణీ చేస్తున్నామని పాతపట్నం పశుసంవర్థకశాఖ సహాయ సంచాలకులు (ఏడీ) ఎం.కరుణాకరరావు అన్నారు. మండలంలోని పెద్దలొగిడిలో గొర్రెలకు నట్టల నివారణ పంపిణీ కార్యక్రమాన్ని ఏడీ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ పాతపట్నం, మెళియాపుట్టి మండలాల్లో 20 పశు వైద్య బృందాల ద్వారా 44,086 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేస్తామన్నారు. సంచార పశువైద్యులు పాల్గొన్నారు.

చిన్నారుల పెద్దమనసు..



కేతన తల్లి రాజేశ్వరికి నగదు అందజేస్తున్న చిన్నారులు

ఆమదాలవలస: పట్టణంలోని భవిత పాఠశాల చిన్నారులు పెద్దమనసు చాటుకున్నారు. పట్టణంలోని ఐ.జె.నాయుడు కాలనీకి చెందిన ఆరో తరగతి విద్యార్థిని(భవిత పాఠశాల) కాయల కేతన బూర్జ మండల పరిధి గుత్తావిల్లి సమీపంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. అదే ప్రమాదంలో విద్యార్థిని తండ్రి కాళిదాసు తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నారు. ఆ కుటుంబానికి తమవంతు సాయం అందజేసేందుకు పాఠశాల చిన్నారులు విరాళాల రూపంలో రూ.53 వేలను సేకరించారు. ఆ మొత్తాన్ని కేతన తల్లి రాజేశ్వరికి గురువారం పాఠశాల వద్ద అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎస్.మురళీధరరావు, డైరెక్టర్ ఎస్.సునీత, హెచ్ఎం కె.వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గ్రామ సర్వేయర్ల నిరసన

ఎల్.ఎన్.పేట: గ్రామ సచివాలయాల పరిధిలో పనిచేస్తున్న గ్రామ సర్వేయర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సర్వేయర్లు కోరారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం నిరసన తెలియజేశారు. మిగులు సిబ్బందిగా ఉన్న గ్రామ సర్వేయర్ల భవిష్యత్‌పై స్పష్టమైన సమగ్ర నివేదిక ఇవ్వాలన్నారు. గ్రేడ్–3 నుంచి గ్రేడ్–2గా హోదా మార్చినందున పే స్కేల్‌లో తగిన మార్పులు చేయాలని కోరారు. జిల్లా స్థాయిలో సీనియార్టీ ప్రకారం అర్హత కలిగిన వారికి పదోన్నతి వచ్చేలా సర్వీస్ రూల్స్‌లో తగిన మార్పులు చేయాలన్నారు. ఇప్పటి వరకు జరిగిన రీ సర్వేకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలన్నారు.

సారవకోటలో..

సారవకోట: సచివాలయ ఉద్యోగుల బదిలీకి ప్రభుత్వం ఇచ్చిన జీఓ నంబర్ 5ను సవరించాలని డెమక్రటిక్ అసోసియేషన్ ఆఫ్ గ్రామ, వార్డు సచివాలయ జిల్లా అధ్యక్షుడు రవి సాహు కోరారు. శుక్రవారం మండల పరిషత్ ఏఓ చిన్నమ్మడుకు మండలంలోని వివిధ సచివాలయాలలో విధులు నిర్వహిస్తున్న సచివాలయ సిబ్బంది వినతిపత్రం అందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నరసన్నపేట: ఈ నెల 27వ తేదీన మండలంలో నరసన్నపేట, ఉర్లాం విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ నిర్వహణ పనులు చేపట్టనున్నారు. ఈ మేరకు ఈఈ శంకరరావు గురువారం తెలిపారు. నరసన్నపేట సబ్‌స్టేషన్ పరిధిలో జమ్ము కూడలి, జమ్ము, తామరాపల్లి, తదితర గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నామన్నారు. ఉర్లాం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధి చోడవరం ఫీడర్‌లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

పరామర్శ..



ప్రసాదరావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న రెడ్డి శాంతి

మెళియాపుట్టి: మండలంలోని జాడుపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు తాళాబత్తుల ప్రసాదరావు తల్లి, సరస్వతి (మాజీసర్పంచ్) ఇటీవల మృతిచెందారు. ప్రసాదరావు కుటుంబ సభ్యులను పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి గురువారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పరామర్శించిన వారిలో మండల నాయకులు కరణం శశిభూషణరావు, పరపటి యోగి, పలువురు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

చెరువు కాదు.. రోడ్డే..



ఈ చిత్రం సరుబుజ్జిలి మండలంలోని పొన్నాంపేట సమీపంలో చెరువును తలపిస్తున్న రోడ్డు. రొట్టవలస నుంచి పురుషోత్తపురం మీదుగా ఆమదాలవలస వరకు వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారిలో కొంత మేర పనులు పూర్తిచేశారు. మిగిలినది విడిచిపెట్టేశారు. వర్షాలు కురవడంతో గోతులు నిండా నీరుచేరింది. దీంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డును బాగుచేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

– సరుబుజ్జిలి

వర్షం పడితే నరకమే..!



ఈ చిత్రం పాతపట్నంలోని బలాజీ నగర్–3 వద్ద బురదమయంగా ఉన్న జాతీయ రహదారి. ఫ్లై ఓవర్ పనులు జరుగుతున్న నేపథ్యంలో అక్కడ బీటీ రోడ్డు లేకపోవడంతో రహదారి బురదతో నిండింది. వర్షం పడితే ఈ రోడ్డులో ప్రయాణించడం నరకయాతనే. శ్రీకాకుళం, టెక్కలి నుంచి పాతపట్నానికి వచ్చి, వెళ్లే వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు జాతీయ రహదారిని బాగుచేయాలని వాహనదారులు కోరుతున్నారు.

– పాతపట్నం

సత్తాచాటాడు..



సందీప్

పొందూరు: ఏపీ పీజీసెట్‌లో పొందూరు మండలానికి చెందిన విద్యార్థులు సత్తా చాటారు. పొందూరుకు చెందిన పుక్కల్ల సందీప్ కెమిస్ట్రీ విభాగంలో 34వ ర్యాంకును సాధించాడు. 100కు 61 మార్కులు సాధించాడు.

పాఠకుల సంఖ్య పెంచాలి

కొత్తూరు: స్థానిక శాఖా గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వి.వి.జి.శంకరరావు గురువారం సందర్శించారు. పాఠకుల సంఖ్యను పెంచాలని గ్రంథాలయ నిర్వాహణ అధికారి ఇందిరకు సూచించారు. గ్రంథాలయాన్ని విద్యార్థులు, నిరుద్యోగులు వినియోగించుకోవాలన్నారు. గ్రంథాలయాల్లో అన్ని రకాల పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు ఉన్నట్లు చెప్పారు. సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. గ్రంథాలయానికి పంచాయతీల నుంచి రావాల్సిన సెస్సు మొత్తాన్ని వసూలు చేయాలని గ్రంథాలయ నిర్వహణ అధికారికి ఆదేశించారు.

అనుబంధ విభాగాల

అధ్యక్షుల నియామకం

ఆమదాలవలస: నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులను వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నియమించారు. ఈ మేరకు గురువారం ఈ జాబితాను విడుదల చేశారు.

విభాగం పేరు	అధ్యక్షుని పేరు
యువజన విభాగం	బొడ్డేపల్లి విశ్వేశ్వరరామ్(రాజు)
మహిళా విభాగం	చిగురుపల్లి ధనలక్ష్మి
రైతు విభాగం	వీరగట్టపు కృష్ణారావు
బీసీ సెల్	వియ్యపు కృష్ణ
ఎస్సీ సెల్	మాచు రామారావు
ఎస్టీ ఎల్	బాడంగి సురేష్ దొర
మైనారిటీ సెల్	షేక్ పీర్ సాహెబ్
క్రిష్టియన్ మైనార్టీ సెల్	సవలాపురపు ఆషీర్ కుమార్
విద్యార్థి విభాగం	మామిడి కిరణ్‌కుమార్
పంచాయితీ విభాగం	మొండేటి కూర్మారావు
మున్సిపల్ విభాగం	పాదిలాపు తిరుపతిరావు
ఆర్‌టీఐ విభాగం	ఇప్పిలి శ్రీను
వాలంటీర్స్ విభాగం	ఇప్పిలి తిరుపతిరావు
గ్రీవెన్స్ విభాగం	ఎం.ఢిల్లేశ్వరరావు
వాణిజ్య విభాగం	జామి రమేష్
వీవర్స్ విభాగం	కాలేపు తవిటిరాజు
వైఎస్సార్ టీయూసీ	గురుగుబెల్లి శేఖర్
అంగన్‌వాడీ విభాగం	పొన్నాడ మాధురి
లీగల్ సెల్	అల్లాడ విజయ్
కల్చరల్ విభాగం	బొడ్డేపల్లి పద్మావతి
సోషల్ మీడియా విభాగం	బూరి గణేష్
ఐటీ విభాగం	కూన రామకృష్ణ
దివ్యాంగుల విభాగం	తర్రా హరినారాయణ
డాక్టర్స్ విభాగం	దానేటి రామ్మోహన్
ఇంటలెక్చువల్స్ ఫోరం విభాగం	బొడ్డేపల్లి నాగరాజు
బూత్ కమిటీస్ విభాగం	మూడడ్ల రమణమూర్తి
పబ్లిసిటీ విభాగం	పి.రవిబాబు

మత్తు పదార్థాలతో జీవితాలు చిత్తు

యువత మాదక ద్రవ్యాలకు యువత, విద్యార్థులు దూరంగా ఉండాలని, చెడు అలవాట్లకు బానిసై భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని వక్తలు సూచించారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. మాదక ద్రవ్యాలతోపాటు గంజాయి వంటి మత్తుపదార్థాలు కలిగి ఉన్నా, సేవించినా కఠిన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. అవగాహన ర్యాలీలు చేపట్టారు. ప్రజాప్రతినిధులు, ఎక్సైజ్, పోలీస్, పలు శాఖల అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



నరసన్నపేట: ర్యాలీలో పాల్గొన్న నాయకులు, అధికారులు



పాతపట్నం: మాట్లాడుతున్న పాతపట్నం జూనియర్ సివిల్ జడ్జి రోషిణి



నరసన్నపేట: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న నరసన్నపేట ఎక్సైజ్ సీఐ రమణమూర్తి



సారవకోట: ఐసీడీఎస్ కార్యాలయ ఆవరణలో ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



పోలాకి: ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు



ఎల్.ఎన్.పేట: ర్యాలీలో పాల్గొన్న అధికారులు, ఉద్యోగులు



సరుబుజ్జిలి: అవగాహన ర్యాలీలో పాల్గొన్న అధికారులు, విద్యార్థులు



కొత్తూరు: ర్యాలీ నిర్వస్తున్న అధికారులు, విద్యార్థులు



పాతపట్నం: అవగాహన ర్యాలీలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు



హిరమండలం: ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు



బూర్జ: ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, అధికారులు, విద్యార్థులు